క్లుప్తంగా

పాదయాత్రకు సంఘీభావం



బసవరాజుకు సంఘీభావం తెలుపుతున్న తమ్మరాజుపల్లె గ్రామస్తులు

పాణ్యం : రాష్ట్రంలో 2024లో 175 సీట్లు గెలవాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎస్టీ మాజీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరాజు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర శనివారం తమ్మరాజుపల్లెకు చేరుకుంది. యాత్రకు సంఘీభావంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు మద్దతు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న వారికి ఆహారం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ముచ్చు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లపాటి బాలరాజు, రామకిట్టు, రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఆదామ్‌బాషా అన్నారు. శనివారం ఆయన సి.బెళగల్ మండలంలోని కంబదహాల్ మెయిన్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో రికార్డులను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించి పాఠశాల నిర్వహణపై సూచనలు చేశారు. అదేవిధంగా విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. హెచ్ఎం నాగన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలి



మాట్లాడుతున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం : మండలంలోని ప్రతి గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా తల్లిండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం పొదుపు భవనంలో పొదుపు సంఘాల సభ్యులకు జెండర్ రిసోర్స్ సెంటర్ సర్వే గురించి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆయా పాఠశాలకు సక్రమంగా వెళ్లని వారి వివరాలు ఇప్పటికే హెచ్ఎంలకు, సీఆర్పీలకు వచ్చాయన్నారు. గ్రామంలో ఎవరైన బడికి వెళ్లాల్సిన పిల్లలు బడిబయట ఉంటే తక్షణమే ఆయా హెచ్ఎంలకు సమాచారం అందించాలని పొదుపుమహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 120 దరఖాస్తులు

సి.బెళగల్: మండలంలోని పోలింగ్ స్టేషన్లలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 120 మంది కొత్తగా ఓటరుగా నమోదుకు (ఫారం–6) దరఖాస్తు అందజేసినట్లు ఆయా గ్రామాల బూత్ లెవల్ ఆధికారులు (బీఎల్వోలు) తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఉన్న 49 పోలింగ్ స్టేషన్లలో బీఎల్వోలు శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. కాగా మండలంలోని పలు గ్రామాలలో బీఎల్వోలు చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్, ఏఎస్ఓ ఆదినారాయణ తనిఖీ చేశారు.

ఓటరు నమోదుకు 864 దరఖాస్తులు

గూడూరు: నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి మొత్తం 864 దరఖాస్తులు వచ్చినట్లు గూడూరు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని కొన్ని కేంద్రాలను ఆయన తనిఖీ చేసి బీఎల్ఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం నిర్వహించాలని, బీఎల్ఓలు తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

కొత్తూరులో సీఈ పూజలు



తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం పంచాయతీరాజ్ సీఈ సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం సీఈకి శేషవస్త్రాలు అందించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. డీఈఈ గంగాధర్, ఏఈ మహబూబ్‌బాషా, సుబ్బారెడ్డి, అర్చకులు కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్ జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- చిందుకూరులో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం



పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: ప్రజాసాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిందుకూరు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. పింఛన్లు, రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు మంజూరు విషయంపై అధికారులతో మాట్లాడుతానని చెప్పారు.

మళ్లీ వైఎస్ జగన్ ఆశీర్వదించాలి

సంక్షేమ పథకాలు అమలు కావాలంటే, నవరత్నాలు మీ ఇంటికి రావాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు తప్పనిసరిగా ఉండేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను ఎలా కత్తిరించాలా అనే ఆలోచనతో పరిపాలన చేయగా తమ ప్రభుత్వం అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూర్చు తోందన్నారు. పారదర్శక పాలన అంటే ఇదే అని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 175 సీట్లు వైఎస్‌ఆర్‌సీపీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వృద్ధుడికి రూ.10 వేలు ఆర్థికసాయం

గ్రామంలోని బీసీ కాలనీలో అంత్రబోయిన సుంకన్న అనే వృద్ధుడు కొన్ని రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే సుంకన్నను చూశారు. అతని ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ప్రభుత్వం నుంచి మీకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆ వృద్ధుడిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీటీసీ పార్వతి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటకృష్ణారెడ్డి, తిరుపంరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, శివానందరెడ్డి, ఎల్లారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి, రవీంద్రారెడ్డి, చలమారెడ్డి, రమేష్, ఏపీఎం హజరత్, ఏఈలు భాస్కర్, మూర్తి, పవన్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఎస్ కొట్టాల గ్రామంలో..

పాణ్యం: మండల పరిధిలోని ఎస్ కొట్టాల గ్రామంలో ఆదివారం గడపగడపకు–మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక పాల్గొనాలన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వారికి బుద్ధి చెప్పాలి

- ప్రజలు తిరగబడాల్సిన అవసరం ఉంది
- జనాల మధ్య చిచ్చుపెట్టే పెత్తందార్లకు కాలం చెల్లింది
- సొంత గ్రామాన్ని విస్మరించిన వారికి గుణ పాఠం చెప్పాలి
- ఎమ్మెల్యే డా.జె సుధాకర్



ఎదురూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: కర్నూలు మండలంలోని గ్రామాలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందకుండా, పేదలను తన వ్యక్తి ప్రయోజనాల కోసం వాడుకుంటూ అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకుంటున్న నాయకులపై ప్రజలు తిరగబడాల్సిన అవసరం ఉందని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలో శనివారం సుంకేసుల, ఆర్.కొంతలపాడు, ఆర్.కె దుద్యాల–ఎదురూరు గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి, వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల కోసం ప్రజలను వాడుకొని పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారిని ఏ మాత్రం పట్టించుకోకుండా కులాల మధ్య, కుటుంబాల మధ్య చిచ్చు పెట్టి చలి కాచుకునే పెత్తందార్లకు కాలం చెల్లిపోయిందన్నారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం నాలుగు దశబ్దాలుగా గ్రామాలను తమ గొప్పిట్లో పెట్టుకొని తాను చెప్పిందే చట్టం, తాను చేసిందే న్యాయమనే విధంగా వ్యవహరించిన వారికి ప్రజలు సరైన గుణ పాఠం చెబితేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

ప్రజలకు మేలు చేసే పనులకు మద్దతివ్వాలి..

ఇన్నేళ్లు గ్రామాల్లోకి ఏ రాజకీయ పార్టీల నాయకులను రాకుండా, ఎలాంటి అభివృద్ధి పనులు చేయకూడదనే పెత్తందారు తన తీరుమార్చుకొని, అహంకారాన్ని వదిలేసి ప్రజలకు మేలు చేసే పనులకు మద్దతూ ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుప డుతున్న నేతలు ఇకనైనా తీరు మార్చుకోవాలని హితవుపలికారు. దశాబ్దాలుగా రాజకీయాలు చేసిన వ్యక్తి గ్రామాల్లో పేదలకు ఇంటి స్థలాలు, కనీసం ప్రజల మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. తన సొంత గ్రామంలో హిందువులకు దేవాలయం నిర్మించాలని స్థానికులు కోరితే.. పనులు మొదలు పెడితే అడుగడున అడ్డుకోవాలని చూశారని గుర్తుచేశారు.

పార్టీలకు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేశామని ఎమ్మెల్యే అన్నారు. కర్నూలు మండలంలో గతంలో కంటే మనందరి ప్రభుత్వం వచ్చాక ఎంతో అభివృద్ధి చేశామని, మునగాలపాడు–సుంకేసుల రోడ్డుపై అభాండాలు వేశారని, కానీ రోడ్డు వేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. అదే విధంగా రేమట రోడ్డు వేస్తున్నామని, గ్రామాల్లో ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇంకేంత కాలం నియంతలకు భయపడతారని, ధైర్యంగా ప్రజలు బయటికి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎన్నికల వరకే రాజకీయమని, ఆ తరువాత గ్రామాభివృద్ధికే ఎవరైనా కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డి.వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్, మహబూబ్ బాషా, మాజీ వైస్ ఎంపీపీ డి.వాసు, సుంకేసుల హనోక్, ఆర్.కొంతలపాడు మద్దిలేటి, ఎదురూరు వెంకటస్వామి, బి.వెంకటేష్, రాజు, బి.మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : కల్లూరు అర్బన్ 36వ వార్డు డ్రైవర్స్ కాలనీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శనివారం స్వగృహంలో డ్రైవర్స్ కాలనీకి చెందిన ఎస్.ఫాతిమాతో పాటు 20 కుటుంబాల వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కాలనీలో ఎటువంటి సమస్య వచ్చినా కాలనీవాసులకు తోడుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రజిత, రాజేశ్వరి, మహేశ్వరి, శైలజ, వరాలు, జ్యోతి, మహేశ్వరి, మస్తాన్ బీ, నాగలక్ష్మమ్మ, భాను తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో 36వ వార్డు ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, పర్ల బుజ్జి, శ్రీనివాసులు, గోవిందు, రాము పాల్గొన్నారు.

చెరువుకు నీరు విడిపించండి



కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసిన బి. తాండ్రపాడు గ్రామస్తులు

కోడుమూరు: బి.తాండ్రపాడు చెరువుకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరు విడిపించాలని మాజీ స్పంచు ఈశ్వరయ్య, ఎంపీటీసీ హనుమంతు, గ్రామస్తులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి కోరారు. శనివారం కోట్ల హర్ష నివాసానికి వెళ్లి తాండ్రపాడులో నెలకొన్న సమస్యలను వివరించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని హంద్రీనీవా కాలువ నీటితో చెరువును నింపాలని కోరారు. ఇందుకు కోట్ల హర్ష జిల్లా కలెక్టర్‌ను కలిసి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు కేశవరెడ్డి, బొజ్జన్న, ప్రభుదాసు, రంగారెడ్డి, దావీదు, బైరాపురం క్రిష్ణ, తదితరులు కుడా చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయండి



పాణ్యం చెంచుకాలనీలో మహిళలతో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తమ పిల్లల భవిష్యత్తుకు బంగాలు బాట వేయాలని నంద్యాల డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జీఈఆర్ సర్వే వందశాతం పూర్తి కావడంతో శనివారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఇందులో భాగంగా పాణ్యంలోని చెంచుకాలనీలో బడిబయట ఉన్న పిల్లల తల్లిదండ్రులతో డీఈఓ మాట్లాడారు. ప్రభుత్వం కోట్లా రూపాయాలు ఖర్చు చేసి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసిందన్నారు. ప్రతి విద్యార్థికి చక్కటి యూనిఫాం, నాణ్యమైన విద్య, శుభ్రమైన ఆహారంతో పాటు డిజిటల్ విద్యను అందిస్తుందన్నారు. అలాగే పిల్లలను బడికిపంపే ప్రతి తల్లికి అమ్మఒడి అందిస్తోందన్నారు. వీటిని తల్లిందండ్రులు ఉపయోగించుకొని తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అనంతరం జీఈఆర్ సర్వే నమోదుపై వలంటీలతో చర్చించారు. అంతకు పాణ్యం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ అధికారులకు రైతుల సన్మానం



కేసీ కెనాల్ అధికారులను సన్మానిస్తున్న రైతులు

గడివేముల: పంట పొలాలు ఎండిపోతున్న సమయంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు పదిరోజుల పాటు కేసీ కెనాల్‌కు సాగునీరు అందించిన అధికారులను రైతులు ఘనంగా సన్మానించారు. మండలంలోని గడిగరేవుల, తిరుపాడు, కొరమద్ది గ్రామాలకు చెందిన రైతులు శనివారం కేసీ కెనాల్ కార్యాలయానికి వెళ్లారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించిన ఈఈ తిరుమలేష్ రెడ్డి, డీఈ సుబ్రహ్మణ్యం రెడ్డి, జేఈలు విజయ్ కుమార్, రాధ కృష్ణలను సత్కరించారు. రైతులు మాట్లాడుతూ పంటలకు అవసరమైన సాగునీరు అందించడంతో దిగుబడులు బాగా వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సురేంద్ర నాథ్‌రెడ్డి, రమణమూర్తి, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలి

గూడూరు రూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులతో సచివాలయం, హౌసింగ్ అధికారులు మాట్లాడి పూర్తి చేయించాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో శనివారం గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలంతో పాటు గృహాన్ని నిర్మించుకునేందుకు నిధులను మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 80 శాతానికిపైగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. 100 శాతం పనులు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

గొందిపర్లలో విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజలో టీజీ వెంకటేష్

కర్నూలు సిటీ: గొందిపర్ల గ్రామంలోని శ్రీకల్యాణ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శనివారం శిఖర, ధ్వజస్తంభం, నవగ్రహ, నాభిశిల, నాగమయ్య విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. గ్రామంలో మొదటి నుంచి ఆధ్యాత్మిక వాతావరణం ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించండి

పాణ్యం : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ సూచించారు. శనివారం ఆలమూరుతో పాటు పలుగ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు దరఖాస్తు దారుడు ఇచ్చిన అర్జీకి సంబధించి పూర్తి వివరాలు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు.

10న వాల్మీకి కార్తీక వనభోజనం

కర్నూలు(న్యూటౌన్): ఈనెల 10వ తేదీ ఆదివారం కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ గుడి దగ్గర శ్రీనివాస గార్డెన్స్‌లో వాల్మీకి కార్తీక వన భోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వాల్మీకి బోయ సేవా సంస్థ నేతలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ భవాని ప్రసాద్ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి కర్నూలులో ఉన్న వాల్మీకి కుల బంధువులందరూ సకుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక 'ఓటరు నమోదు'కు విశేష స్పందన

కల్లూరు: మండలంలోని గ్రామీణ, అర్బన్ పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. మండలంలో ఫారం–6 కు 1,113 మంది ఫారం–7 కు 416, ఫారం–8 కు 496 దరఖాస్తులు వచ్చాయన్నారు. నేడు కూడా బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు.

సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు : అర్హత ఉన్న యువతీ, యువకులు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో జరుగతున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

గడివేముల: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గడివేముల మండలంలో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. చిందుకూరు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఫారం–6లు 225, ఫారం–7లు 66, ఫారం–8లు 80 వచ్చాయన్నారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే సరిచూసుకోవాలని తెలిపారు. ఆదివారం కూడా ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

పాణ్యం ఈఓగా సువర్ణ

పాణ్యం: మండల దేవదాయశాఖ ఈఓగా సువర్ణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకు ముందు ఉన్న యూ.లక్ష్మీనారాయణ నంద్యాల పట్టణంలోని కాలికాంబ దేవాలయానికి ఈఓగా ఉంటూ పాణ్యం ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తుండేవారు. కొత్తగా ఉద్యోగం పొందిన సువర్ణ మొదటి పోస్టింగ్‌గా పాణ్యంకు వచ్చారు. ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. సిబ్బంది తరుమలయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



గని గ్రామంలో వేల్పనూరు లక్ష్మీదేవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మహాలక్ష్మి

గడివేముల: వైఎస్ఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. రెండో రోజు శనివారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వృద్ధులు, వితంతువులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. తాము ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చి పింఛన్ అందజేయడంపై పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

గూడూరు: జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరావ్ శనివారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని రేమట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలో సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పని తీరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గతంలో పథకాలకు అర్హత పొందాలంటే రాజకీయ నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షణలు చేసే వారన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన తరువాత ఆధార్‌కార్డు తీసుకొని సచివాలయానికి వెళ్తే ఏ సంక్షేమ పథకానికి అర్హత ఉంది, ఏ పథకానికి అర్హులు కాదో స్పష్టంగా చెబుతారని అన్నారు. పైసా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పథకాల లబ్ధి జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మెన్ తిరుమల్ రెడ్డి, స్థానిక నాయకులు ఎస్.సంపత్‌కుమార్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, ఉల్చాల సర్పంచ్ సాగర్, ఆనంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

గడివేముల: ఉపాధ్యాయులు ,ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు కోరారు. శనివారం మండలంలోని గడిగరేవులలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జీపీఎస్) వల్ల ప్రయోజనం లేదన్నారు. పదవి విరమణ తర్వాత సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్నే తిరిగి అమలు చేయాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు నూతన సర్వీసు రూల్స్ ఆలస్యమవుతున్నందున ప్రస్తుతం ఉన్న సర్వీస్ రూల్స్ ప్రకారం తక్షణమే బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్. మహబూబ్ బాషా, ఎ. నాగన్న, నంద్యాల జిల్లా కార్యదర్శి ఆవుల మునిస్వామి, గడివేముల మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగాల బాలస్వామి, మానపాటి రవి, సీనియర్ నాయకులు ఎం. ప్రతాపరెడ్డి, కె.రాముడు, బి. రాంపుల్లారెడ్డి, మారెన్న, జి. శ్రీరాములు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర ఆచారి, మహిళా ప్రతినిధులు యు. కవిత, లక్ష్మీదేవి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దస్తగిరి

పాణ్యం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. శనివారం పిన్నాపురం, సుగాలిమెట్ట గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. శాఖల వారీగా అమలవుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు క్రిష్ణయ్య, దేవిబాయి, అధికారులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

కల్లూరు: మండల పరిధిలోని చెట్లమలాపురం, నాయకల్లు గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఆయా కార్యక్రమా ల్లో ఎంపీడీఓ రమణమూర్తి పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, చెట్లమలాపురం సర్పంచ్ భూపాల్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధి దొడ్డిపాడు గ్రామానికి చెందిన పి.చిన్న మౌలాలి(18) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్ఐ నల్లప్ప తెలిపిన మేరకు వివరాలు... దొడ్డిపాడు గ్రామానికి చెందిన చిన్న మౌలాలి రెండు సంవత్సరాల నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. గత నెల 24న రాత్రి ఊరు బయట పొలాల్లో పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. శనివారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.